www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 21 జూన్ 2025

5

కాకినాడ



నేడు కళారూపాల శిక్షణా శిబిరం

ప్రజాశక్తి-పెద్దాపురం

ఈ నెల 22న జరిగే ప్రజాకవి, ప్రజా నాయకుడు యాసలపు సూర్యారావు 13వ వర్ధంతి కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 21న కళారూపాల శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్టు సిరపరపు శ్రీనివాస్ తెలిపారు. యాసలపు సూర్యారావు భవనంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణా శిబిరాన్ని స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ అధ్యక్షులు గొందేశి రాజా ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా జరిగే సభకు ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి రొంగల వీర్రాజు అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ సభలో సిపిఎం రూరల్ కార్యదర్శి కేదారి నాగు, ప్రముఖ కళాకారుడు, భజన పరిషత్ న్యాయ నిర్ణేత నీలం శ్రీను ప్రసంగిస్తారన్నారు.

పల్లెల్లో పడకేసిన అభివృద్ధి

- ఆర్థిక సంఘం నిధుల కోసం నిరీక్షణ
- పంచాయతీల్లో పనులకు ఆటంకం
- మూడు నెలలుగా ఎదురుచూపులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పంచాయితీల వీధిలైట్లు, మంచినీటి సరఫరా స్కీముల విద్యుత్తు బకాయిల చెల్లింపు, గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక ప్రకారం తాగునీరు, పారిశుధ్యం, గ్రీన్ అంబాసిడర్లు జీతాల చెల్లింపు, తాగునీటి పైపు లైను నిర్వహణ తదితర ఖర్చులను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచే ఖర్చు చేయాల్సి ఉంది. గత కొన్ని నెలలుగా ఈ నిధులను ప్రభుత్వం విడుదల చేయడం లేదు. దీంతో పంచాయతీల్లో అభివృద్ధి పడకేసిందని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులకు ఆస్కారం ఉండడం లేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా పంచాయతీల పరిస్థితులు మారతాయని భావిస్తే గత సర్కారు హయాంలో మాదిరిగానే ఇప్పుడూ అభివృద్ధి అటకెక్కుతోందని ఆందోళన చెందుతున్నారు.

కాకినాడ జిల్లాలో 265 క్లస్టర్ల పరిధిలో 385 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. స్థానికంగా పన్నుల వసూళ్లు, వివిధ గ్రాంట్లు సక్రమంగా వస్తేనే అభివృద్ధికి అవకాశం ఉంటుంది. గత ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను ఇతర అవసరాలకు మళ్లించడంతో అభివృద్ధి బాగా కుంటుపడిందని, గత వైసిపి పాలనను ఇప్పుడు ఉన్న కూటమి పెద్దలు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎన్నికల సమయంలో కూడా గ్రామపంచాయతీల తీరుపై తీవ్ర స్థాయిలో విస్మయం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామపంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ఎప్పటికప్పుడు నిధులను కేటాయిస్తామని, ఆర్థిక సంఘాల నిధులను దారి మళ్లించడం కాక నేరుగా గ్రామపంచాయతీ ఖాతాలకు జమ చేసి అభివృద్ధికి ఆస్కారం కల్పిస్తామంటూ చెప్పుకొచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చిన కూటమి పెద్దలు అదే రీతిన వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు.



రావాల్సింది రూ.28.38 కోట్లు పైనే...

2024-25 ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు బేసిక్, టైడ్ నిధులు కలిపి రూ.28,38,37,423 వచ్చాయి. రెండో విడత బకాయి కూడా ఇదే సంఖ్యలో రావాల్సి ఉంది. 3 నెలల క్రితమే ఈ బకాయి విడుదల కావాల్సి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పంచాయతీ ఖాతాలకు జమ కాలేదు. తుని నియోజవర్గానికి రూ.4.16 కోట్లు, ప్రత్తిపాడు రూ.4.94 కోట్లు, పిఠాపురం రూ.4.37 కోట్లు, కాకినాడ రూరల్ రూ.2.73 కోట్లు, పెద్దాపురం రూ.3.18 కోట్లు, జగ్గంపేట నియోజకవర్గానికి రూ.4.33 కోట్లు విడుదలవ్వాల్సి ఉంది.

నిధుల మళ్లింపు

కేంద్ర విడుదల చేస్తున్న ఆర్థిక సంఘాల నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్ళిస్తూ ఉండడంతో గ్రామాల అభివృద్ధి వెనుకబడుతోంది. గత ప్రభుత్వం ఇదే మాదిరిగా ఆర్థిక సంఘాల నిధులను ఇతర అవసరాలకు మళ్లించడంతో కనీసం పారిశుధ్య పనులను సైతం నిర్వహించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే దారిలో వ్యవహరిస్తుండటం వల్ల ఆర్థిక సంఘాల నిధులు అక్కరకు రాకుండా పోతున్నాయి. దీంతో అనేక పంచాయతీల అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నాయని గ్రామీణ ప్రాంతాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అధ్వానంగా పారిశుధ్యం మారడంతో ఎక్కడికక్కడ దోమలు దండయాత్ర చేస్తున్నాయని, రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైన్లలో పూడికతీత పనులు సక్రమంగా నిర్వహించడం లేదని వాపోతున్నారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలను పూర్తిస్థాయిలో ఇవ్వలేని పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే దుస్థితి ఏర్పడింది. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో ఈ నిధులను గ్రామపంచాయతీల ఖాతాలకు తక్షణమే జమ చేయాలని పలువురు సర్పంచులు కోరుతున్నారు.

జులై 9న సార్వత్రిక సమ్మెకు సిద్ధపడాలి

ప్రజాశక్తి-కాకినాడ

లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, జులై 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కచేరిపేట సిఐటియు కార్యాలయంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, ఐఎన్‌టియుసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ తాళ్లూరి రాజు, ఎఐసిసిటియు రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యనారాయణ, రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు మాట్లాడారు. బ్రిటిష్ వాడితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ మతోన్మాద ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్లు తెచ్చిందని విమర్శించారు. స్వతంత్రానికి ముందుగాని, తర్వాత గానీ వచ్చిన కార్మిక చట్టాలు ఏవీ కూడా ఒకరి దయతో వచ్చినవి కాదని, వేలాదిమంది కార్మికులు తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న హక్కులని గుర్తు చేశారు. 3 నల్ల చట్టలతో రైతులను, 4 లేబర్ కోడ్లలో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కరోనా సంక్షోభాన్ని, ఉగ్రవాద సంక్షోభ పరిస్థితులను మోడీ మతోన్మాద ఎజెండాను అమలు పరిచేందుకు, కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరిచేందుకు వాడుకుంటవిమర్శించారు. కార్మికులు అందరూ కూడా సమ్మెను బలపరచడం ద్వారా మోడీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, మేడిశెట్టి వెంకటరమణ, పలు ప్రజా సంఘాల నాయకులు టి.రాజా, చంద్రమళ్ల పద్మ, బొబ్బిలి శ్రీనివాసరావు, కె.ఆదినారాయణ, కెవి.రామయ్య, బంగారు రాజేష్, నక్క లక్ష్మణ్, మీసాల చక్రవర్తి, సత్యనారాయణ, నిమ్మకాయల ఈశ్వరరావు, నక్క అప్పన్న, రాలిపూడి వెంకన్న, గుబ్బల ఆదినారాయణమూర్తి, రాగుల రాఘవులు, గరగ దుర్గారావు, లచ్చారావు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

మహిళలపై హింసను ప్రతిఘటించాలి

ప్రజాశక్తి -తాళ్లరేవు

సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని బీమా భాయి మహిళా మండలి ముఖ్య కార్యనిర్వాహకురాలు వాసంశెట్టి నందివర్ధన పిలుపునిచ్చారు. బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో కార్యాలయంలో స్వయం సహాయక బృందాలకు, మహిళా బృందాలకు జెండర్ సమానత్వం, జెండర్ ఆధారిత హింస, మహిళా రక్షణ చట్టాల చట్టాలపై అర్థ సంవత్సర శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందివర్ధన, మహిళా మండలి నాయకులు మంగతాయారు, ఆర్గనైజర్ టి కవిత మాట్లాడారు. స్త్రీ, పురుష సమానత్వం కొనసాగించడం ద్వారా సమాజంలో శాంతియుత వాతావరణం ఏర్పడుతుందని వివరించారు. గృహహింస చట్టం, నిర్భయ చట్టం తదితర మహిళా రక్షణ చట్టాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భీమాబాయి మహిళ మండలి సిబ్బంది పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న నందివర్ధన

ఈదురు గాలులతో భారీ వర్షం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

మండలంలో ఈదురు గాలిలతో వర్షం బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి ఉక్కపోతతో సతమతం అవుతున్న ప్రజలకు శుక్రవారం సాయంత్రం అయ్యేసరికి చల్లటి వాతావరణం ఏర్పడింది. ఒక్కసారిగా గాలులు.. వర్షం రావడంతో పలు రహదారులు వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. ఉప్పాడ రింగ్ రోడ్డు.. కొత్తపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో వర్షపు నీరు ఏరులై పారింది. సాయంత్రం అయ్యేసరికి ఏర్పడిన పెనుగాలులు... వర్షానికి పలు దుకాణ యాజమానులు ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం

అతిసార వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-గొల్లప్రోలు


పట్టణంలో పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఒఆర్ఎస్, అతిసార వ్యాధిపై ఆరోగ్య పర్యవేక్షకులు అవగాహన కల్పించారు వడదెబ్బ, ఉష్ణతాపంపై జాగ్రత్తలు తీసుకోవాలని, ఒఆర్ఎస్ వాడే విధానం, ప్రయోజనం ఇంటిలో లభించే శీతల పానీయాలు తీసుకోవాలని, పిల్లలకు అతిసార వ్యాధి నివారణ చికిత్సలపై అవగాహన కల్పించారు. మండలంలోని తాటిపర్తి గ్రామం ఆరోగ్య కేంద్రంలో సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించి ఫ్యామిలీస్‌కి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అహ్మద్ బాషా, రజిని, లక్ష్మీ రమణి, ఎఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

మూలపేటలో స్థల వివాదం

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

మూలపేట ప్రకాష్ నగర్‌లో ఉన్న స్థల విషయంలో రెండు సామాజిక తరగుతుల మధ్య శుక్రవారం వివాదం చోటు చేసుకుంది సుమారు 25 సెంట్ల భూమిని ఆక్రమించారని టిడిపి నాయకుడు, సిద్ధి నాగు ఆరోపించారు. తమ కమ్యూనిటీకి చెందిన స్థలాన్ని ఆక్రమించారని స్థలాన్ని ఖాళీ చేయాలని మరొకరు డిమాండ్ చేశారు. ఇర గ్రూపులూ స్థలం మాదంటే మాదని తెలపడంతో సర్వేయర్ సర్వే చేస్తున్న క్రమంలో వాగ్వాదం చోటు చేసుకుని ఘర్షణకు దిగారు. దీంతో అక్కడి స్థానికులు కలగజేసుకుని సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. మండలంలోని అధికారులు కలగజేసుకొని ప్రకాష్ నగర్‌లో ఉన్న స్థలం ఎవరికి చెందుతుందో నిర్ధారించి రెండు సామాజిక తరగతులకూ న్యాయం చేయాలని, వివాదానికి ముగింపు పలకాలని స్థానికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

కార్టూ'నిజం'



ఋతుపవనాల కదలికలో ఆలస్యం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నగరాభివృద్ధికి ఏం చేశారో చెప్పాలి

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్రంలో టిడిపి కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా జనసేన, టిడిపి నాయకులు విడివిడిగా సంబరాలు చేసుకున్న నేపథ్యంలో ఏడాది పాలనలో కాకినాడ నగరాభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కూటమి పెద్దలు ఏమి చేశారో ప్రజలకు చెప్పాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. తల్లికి వందనంలో నిబంధనల వల్ల చాలా మంది అనర్హులుగా మిగిలి పోయారన్నారు. ప్రి పెయిడ్ స్మార్ట్ మీటర్లను పగల గొట్టాలని లోకేష్ గతంలో పిలుపు ఇచ్చారని, నేడు గుట్టుచప్పుడు కాకుండా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు రక్షణ విషయంలో కూడా మాట మార్చారని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు, స్కీమ్ వర్కర్స్‌కు జీతాలు పెంచలేదని, మరొకపక్క ప్రభుత్వ పథకాలు కూడా అమలు చేయడం లేదని చెప్పారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడారు. కె.సత్తిరాజు, మలకా వెంకట రమణ, మేడిశెట్టి వెంకట రమణ పాల్గొన్నారు.

గోరంట్ల వ్యాఖ్యలు సిగ్గుచేటు : జమ్మలమడక నాగమణి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

మాజీ సిఎం వైఎస్ జగన్‌ను భూస్థాపితం చేస్తామంటూ ఎంఎల్ఎ గోరంట్ల చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలను దిగజార్చి హత్యా రాజకీయాలను ప్రోత్సహించే విధంగా ఉన్నాయని వైసిపి రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు తాము అభిమానించే నాయకుని కలుసుకోవడం కూడా తప్పే అన్నట్లు చిత్రీకరించే ప్రయత్నంలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఇటువంటి ఆలోచనలు కలిగిన నాయకులు ఎంతమందిని భూస్థాపితం చేసి తమ అధికారాన్ని కాపాడుకుంటారని ఆమె ప్రశ్నించారు. గతంలో కూడా అయ్యన్నపాత్రుడు జగన్ ఓడిపోయాడు తప్ప చచ్చిపోలేదని వ్యాఖ్యానించారని, వీరి ఆలోచనా విధానం చూస్తుంటే అధికారం దక్కించుకోవడానికి ఎవరినైనా చంపడానికి కూడా వెనుకాడరనే విషయం అర్థం అవుతుందన్నారు. గతంలో చంద్రబాబు కూడా వెన్నుపోటు రాజకీయాల ద్వారా ఎన్టీఆర్‌ను భూస్థాపితం చేయడానికి ప్రయత్నించారని అది తన వల్ల సాధ్యం కాదని గ్రహించి నేడు తన పార్టీని అధికారాన్ని కాపాడుకోవడానికి ఆయన విగ్రహాలకు పూజిస్తున్నట్లు నటిస్తున్నారని ఆమె విమర్శించారు. ప్రజల గుండెల్లో ఉన్న జగన్ లాంటి నాయకుడిని భూస్థాపితం చేయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

పలుచోట్ల శుక్రవారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ ప్రభుత్వ పాలనలో అత్యంత కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు నిత్యం సేవలు అందించే అవకాశం రెవెన్యూ శాఖకు ఉంటుందని, మారుతున్న కాలానుగుణంగా రెవెన్యూ సేవలను మరింత సమర్థతతో ప్రజలకు అందించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ షాన్ మోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రత్నకుమారి, పెద్దాపురం ఆర్‌డిఒ కె.శ్రీరమణి ఇతర అధికారులతో కలిసి తోట సుధాకర్ ప్రసాద్ చిత్రపటానికి పూలమా వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం జిల్లాలోని వివిధ మండలాల తహశీల్దార్లు, ఇతర సిబ్బందికి ప్రశంస పత్రాలను అందజేశారు. ఉద్యోగ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులను సత్కరించారు. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్ సగిలి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ అతి ప్రాచీనమైనదన్నారు. ప్రభుత్వ పాలనలో అత్యంత కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు నిత్యం సేవలుందించే అవకాశం రెవెన్యూ శాఖకు ఉంటుందని ఆయన తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది మారుతున్న కాలానుగుణంగా ప్రజల అవసరాలను తీర్చే విధంగా రెవెన్యూ సేవలను మరింత సమర్థతతో అందించాలన్నారు. పేద, సామాన్య ప్రజలకు అత్యంత చేరువగా రెవెన్యూ సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని రెవెన్యూ సిబ్బందికి సంబంధించి తన దృష్టికి తీసుకువచ్చిన వివిధ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. డిఆర్ఓ జె.వెంకటరావు మాట్లాడుతూ గత 2024 నుంచి జూన్ 20న రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. పుట్టుక దగ్గర నుంచి మరణం వరకు రెవెన్యూ శాఖ సేవలు అందిస్తుందన్నారు. స్వాతంత్రం రాకముందు 1786 జూన్ 20న బ్రిటిష్ పాలకులు బోర్డ్ ఆఫ్ రెవెన్యూను ఏర్పాటు చేశారన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్ఎస్ఎ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.త్రినాథరావు, వివిధ సంఘాల నాయకులు ఎం.జగన్నాథం, చిన్నారావు, అబ్బులు, ఎస్.చినపాపారావు, ఎఐ ఎస్.రామ్మోహన్, వివిధ మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.



పెద్దాపురంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీరమణి



కాకినాడలో రిటైర్డ్ ఉద్యోగులను సత్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

జగ్గంపేట తహశీల్దారు కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దారు పార్థసారధి ఆధ్వర్యంలో రిటైర్డ్ విఆర్‌ఒలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వడ్డి శ్రీనివాస్ రావు, విఆర్‌ఒలు, విఆర్ఎలు, పాల్గొన్నారు.

పెద్దాపురం ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందించడంలో రెవెన్యూ శాఖ కీలకంగా విధులు నిర్వహిస్తోందని ఆర్‌డిఒ శ్రీరమణి అన్నారు. తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు సేవలందించడంలోనే కాక సంక్షోభ సమయాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రెవెన్యూ శాఖ విరామం లేకుండా సేవలందిస్తోందన్నారు. ఈ సభలో పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ తుమ్మల పద్మజ, రిటైర్డ్ తహశీల్దారు సాగర్, రిటైర్డ్ విఆర్‌ఒ అరకరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, నూనె రామారావు, అరవింద కుమార్, రేలంగి వెంకటరావు, కొరుపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఆశా వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూన్ 23న స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆఫీస్ వద్ద ధర్నా చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ నిర్ణయించింది. దీనిలో భాగంగా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకత్వం శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరసింహ నాయక్ వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ మాట్లాడుతూ ఆశా వర్కర్స్ గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తు మాతా శిశు మరణాలు తగ్గించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఆశా వర్కర్లు బడుగు బలహీన నిరుపేద కుటుంబాలకు చెందిన వారైనా ప్రభుత్వం రూ.10 వేల వేతనం ఇస్తోందని, ఉండటానికి ఇల్లు ఇవ్వకుండా కట్టుకోవడానికి లోన్ లేకుండా తల్లికి వందనం అమలు చేయకుండా ఆశా వర్కర్ల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణం అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు చూస్తే ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితులలో ఆశా వర్కర్ల బతుకే భారమైందని వాపోయారు. తక్షణం ఆశా వర్కర్ల అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె కోరారు. ప్రభుత్వ నాసిరకమైన 2జీ ఫోన్‌లు మార్చి 4జి ఫోన్లు ఇవ్వాలని, టిబి, లెప్రసీ, ఎన్‌సిడి, ఫీవర్ సర్వే, పిఎంవివివై అప్లికేషన్లు చేయించిన వాటికి పారితోషకాలు ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్‌లో చేసిన ప్రతి పనికీ రికార్డులు పెట్టాలని అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. పిహెచ్‌సికి వచ్చిన ప్రతిసారీ టిఎ, డిఎలు ఇవ్వాలని ఆమె తెలిపారు. ఈ స్థానిక సమస్యలపై జూన్ 23న స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయుడు నాగలక్ష్మి, పి.అనంతలక్ష్మి, ఎం.భారతిప్రియ, ఆశాజ్యోతి, భవాని, ఎస్ లక్ష్మి, మంగరాజు పాల్గొన్నారు.



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న వర్కర్లు

కలెక్టరేట్ ముట్టడికి తరలిన కార్మికులు

ప్రజాశక్తి- పెద్దాపురం

ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 45వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ కార్మికులు తలపెట్టిన కలెక్టర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి పెద్దాపురం ఇంజినీరింగ్ కార్మికులు తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు, సంఘం నాయకులు బాసిన భద్రరావు, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, ఒ.సోనియా, సుంకర సత్తిరాజు, మలిపెద్ది భద్రరావు, బొమ్మన రవికుమార్, అయ్యప్ప స్వామి, పూల ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌కు మృతికి సంతాపం

ప్రజాశక్తి- సామర్లకోట

స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో సుదీర్ఘ కాలం సేవలందించిన కురుకూరి శ్రీనివాస్ మృతికి హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ సంతాపం తెలిపారు. రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్ ఆకస్మిక మరణం చెందారనే వార్త చాలా బాధాకరంగా ఉందన్నారు. మంచి సేవా దక్పథం గల టీచర్‌ను కోల్పోయామన్నారు. ఇటీవల బదిలీ అయ్యేంత వరకు ఆయన తమ స్కూల్‌కు చేసిన సేవలు మరువ లేనివన్నారు.

వృద్ధులకు పాదరక్షల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేట కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి సౌజన్యంతో వృద్ధులకు పాదరక్షలు, విసనకర్రలు, మజ్జిగ పంపిణీ చేశరు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాటి మనిషికి సాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. దాతృత్వానికి కులం, మతం అడ్డు కాదని విశ్వ ప్రేమతో సమాజ సేవ చేయాలన్నారు. నిరంతరం పరోపకారం కోసం తపించాలని వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్త అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో ప్రశాంతత అవసరం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వృద్ధాప్యంలో సంతోషంగా, ప్రశాంతంగా గడిపేందుకు కృషి చేయాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. రమణయ్యపేట రాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వృద్ధాప్యంలో సంతోషకరమైన జీవితం, ఆరోగ్యకరమైన జీవన శైలి అవసరమన్నారు. సాధించిన విజయాలతో అర్జించిన, సంపదలతో సంతృప్తి చెంది ఆత్మవిశ్వాసంతో మెలగాలన్నారు. శక్తికి మించిన ప్రయాసలకు గురికారాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి - ఆత్రేయపురం, కరప

మండల కేంద్రం ఆత్రేయపురం గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ ఎస్.రాము తన సిబ్బందితో శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఐదుగురు వ్యక్తులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,330 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు నమోదు చేసినట్లు తెలిపారు.

కరప నడకుదురు శివారులో పేకాట శిబిరంపై శుక్రవారం ఎస్ఐ తోట సునీత సిబ్బందితో దాడి చేసి పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.8,220 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కేసుల నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం, జగ్గంపేట

ఆత్రేయపురం రేవు సెంటర్ వద్ద వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఇద్దరు మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా అధికంగా మద్యం తాగినట్లు నిర్ధారణ కావడంతో వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

తాగి వాహనాలు నడుపుతున్న 21 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. వారిని కోర్టులో హాజరు పరచగా 12 మందికి రూ.పది వేల చొప్పున జరిమానా విధించారని, ఏడుగురికి మూడు రోజుల జైలు శిక్ష, ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు తెలిపారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిపై కొందరు వ్యక్తులు దాడి చేసిన కేసులో బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జ్ ఎస్ఐ ఎంవివి.రవీంద్రబాబు శుక్రవార తెలిపారు. వివరాల మేరకు నగర పంచాయతీ పరిధిలోని సోమిదేవరపాలెంకు చెందిన గుర్రాల సత్యనారాయణను అదే గ్రామానికి చెందిన పువ్వల శ్రీనివాసరావు, ఉందుర్తి ఏడుకొండలు, చుట్టుగుళ్ళ విజయ్, మట్టా సతీష్ దారి కాచి దాడి చేశారని సత్యనారాయణ ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయగా, అలాగే అదే సంఘటనకు సంబంధించి పువ్వల శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్రాల సత్యనారాయణ అతని కుమారుడు లోవరాజులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి-నల్లజర్ల

తాడేపల్లిగూడెం మండలం ఆరుగొల్లు గ్రామానికి చెందిన తన కుమార్తె అదృశ్యమైందని తండ్రి రాజు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చదువు పూర్తవడంతో అమ్మమ్మ గ్రామమైన ఘంటా వారి గూడెంలో ఉంటుందని, ఈనెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో గాలించామని, అయినా ఆచూకీ దొరకలేదని తెలిపారు. దీంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

వివాహిత మృతిపై కేసు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వివాహిత మహిళ ఉరేసుకుని మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం మునిపల్లి గ్రామానికి చెందిన సంధ్య, మండలంలోని మోర్త కు చెందిన నాగేశ్వరరావుతో 2020 లో వివాహమైంది, వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంధ్య, నాగేశ్వరావు మధ్య శుక్రవారం వివాదం చోటు చేసుకుంది. మనస్థాపానికి గురైన సంధ్య(22) భర్త ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తండ్రి కారింకి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎఎస్ఐ తెలిపారు.

మరిడమ్మ ఆలయంలో పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం స్వర్ణ, రజిత పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు, ఆసాదులు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమాలలో పాల్గొన్న వారందరికీ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, వేద పండితులు ఎన్‌వి.అవధాని, శంకర్, సిబ్బంది ఎస్.రమణ, వరహాలు, శివ, క్రాంతి పాల్గొన్నారు.

సత్ప్రవర్తనపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి విద్యార్థి చిన్ననాటి నుండి సత్ప్రవర్తన, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ వి.మౌనిక అన్నారు. శుక్రవారం స్థానిక సాగర్ జూనియర్ కళాశాలలో ఆమె విద్యార్థులకు చట్టాలు, సత్ప్రవర్తన, ప్రస్తుత సమాజంలో సమస్యలపై అవగాహన కల్పించారు. క్రమశిక్షణకు ప్రతి విద్యార్థి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళలు, బాలికలకు రక్షణగా అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై ప్రతి విద్యార్థిని అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలకు రక్షణ యాప్‌లపై వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.అచ్యుతరామయ్య, కరస్పాండెంట్ పి.శ్రీదేవి పాల్గొన్నారు.

ఆదిత్యలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఎఐ టూల్స్ ఫర్ రీసెర్చ్ అండ్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ టెక్నిక్స్ అనే అంశంపై రెండు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ప్రారంభమైందని ఆదిత్య విద్యాసంస్థల డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటిరోజున, బెంగుళూరు అలయన్స్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.సేంతామరైకన్నణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయుల రీసెర్చ్ స్కిల్స్ పెంపొందించడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యతను విపులంగా వివరిస్తూ ఎఐ ఆధారిత ఉపకరణాలపై, హాండ్స్ ఆన్ శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్స్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, కో ఆర్డినేటర్ డార్టర్ ఎ.శరవణన్ పాల్గొన్నారు.

యానాం వార్తలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐలు నూకరాజు, సుబ్బరాజు

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - యానాం

సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు అన్నారు. స్థానిక కనకాల పేట కామిశెట్టి వరప్రసాదరావు నాయుడు ఉన్నత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ కట్టా సుబ్బరాజు మాట్లాడుతూ మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగతం చేయాలన్నారుమాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యడ్ల శాంతి, నళినిపాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

యానాం రీజెన్సీ విద్యాసంస్థలు ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యోగ మేళాకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు హెచ్.ఎం.ప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపల్ మార్తాండ ప్రసాద్ తెలిపారు. హైదరాబాద్ లోని వివిధ ఆసుపత్రుల్లో ఉద్యోగాల కోసం ప్రాథమిక షార్ట్ లిస్టు చేయడానికి గాను దరఖాస్తులుస్వీకరిస్తున్నట్టు తెలిపారు. రీజెన్సీ విద్యాసంస్థలలో చదివిన పూర్వ విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. స్థానిక రీజెన్సీ హైస్కూల్, కళాశాల ప్రాంగణంలో ప్రతి శని, ఆదివారాల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. రీజెన్సీ విద్యా సంస్థల్లో అధునాతన సాంకేతిక అంశాలపై ప్రైమరీ తరగతుల నుంచే శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. 5వ తరగతి నుంచి అన్ని క్లాసులలో కృత్రిమ మేధపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

మత్స్యకారులకు బ్యాంకు రుణాల మంజూరు

ప్రజాశక్తి - యానాం

సుమారు 70 మంది మత్స్యకారులకు పుదువై భారతీయర్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో కిసాన్ క్రెడిట్ లోన్స్ మంజూరు చేశారు. స్థానిక మత్స్య శాఖ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించి ముఖ్యఅతిథి ఆర్ఎఐ మునిస్వామి రుణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పుదువై భారతీయర్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ డి.రత్నవేల్, డిడిఎం నాబార్డ్ ఆర్‌వి.సిద్ధార్ధన్, బ్రాంచ్ మేనేజర్ ఉదయ్, మత్స్యశాఖ అధికారి డి.గొంతయ్య పాల్గొన్నారు.

వృద్ధులపై వేధింపుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

వృద్ధులు నిర్లక్ష్యానికి, నిరాదారణకు గురవుతున్నారని సమకాలీన సామాజిక, ఆర్థిక పరిస్థితులు వద్దులకు శాపంగా మారాయని సీనియర్ సిటిజన్ల హక్కులను, కుటుంబసభ్యులతో పాటు సమాజం కూడా గుర్తించాలని పలువురు పేర్కొన్నారు.శుక్రవారం ప్రపంచ వద్దుల వేధింపుల నివారణ అవగాహన రోజును పురస్కరించుకుని స్థానిక సబ్ కోర్టులో యానాం న్యాయ సేవాసమితి (యానాం లీగల్ ఎయిడ్ కౌన్సిల్) ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లకు వారికుద్దేశించిన చట్టాలు,హక్కులు గూర్చి వివరించారు. వద్దుల సంక్షేమం, తల్లిదండ్రుల పోషణ చట్టం-2007 తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ జడ్జి ఆర్.సుబ్రహ్మణ్యం,న్యాయ సేవాసమితి న్యాయవాది పి.ఆదినారాయణ మూర్తి, న్యాయవాదులు నటరాజన్,కమిడి విజయకుమార్, ఎపిపి ఎస్ఎస్ శ్రీనివాస్, పడాల సుబ్బారావు, గెద్దం భ్రమరాంబిక, స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గోదావరిలో ఇసుక మాఫియా అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని కమిని పంచాయతీ పరిధిలోని త్రివేణి సంగమం వద్ద గత కొద్ది రోజులుగా ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతూ యథేచ్ఛగా తరలిస్తుండటం పై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల ఇదే ప్రాంతంలో ఈతకు దిగి 8 మంది విద్యార్థులు దుర్మరణం చెందిన ఘటన జరిగిన ప్రాంతానికి కూతవేటు దూరంలో మళ్ళీ ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడం పలువురు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రవ తవ్వకాలతో నదీ కోతకు గురవుతుందని. దీని ప్రభావంతో సారవంతమైన భూములు నదీ గర్భంలో కలిసిపోతున్నాయని వాపోతున్నారు. కలెక్టర్ ఆదేశాలను సైతం గాలికొదిలేసి ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి నదీ గర్భం నుంచి పడవలతో అక్రమంగా ఇసుకను తవ్వడమే కాకుండా, యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా రాత్రిపగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్లుతో ఇసుకను రవాణా చేస్తు పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

రైతు సంక్షేమ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కూళ్ల డిసి ఛైర్మన్ మేక శివప్రసాద్ అన్నారు. శుక్రవారం టేకి గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలు పరిష్కరిం చేందుకు ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందన్నారు. పలు అంశాలపై రైతులతో చర్చలు జరిపారు. టేకి డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూటి కాడ తొలగింపు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలమూరు డిసి మెల్లగోపాలం, రామచంద్రాపురం డిసి నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి వైస్ డిసిలు, అంగర, మాచర, చింతలూరు నీటి సంఘం అధ్యక్షులు, మాజీ డిసి ఛైర్మన్లు, డ్రెయినేజీ డి ఇ పోచరావు,అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మెర్ల పాలెం శివారు వాసంశెట్టి వారి పాలెం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన వాసంశెట్టి సత్యనారాయణ రూ.5 వేల విలువ చేసి నోట్ బుక్స్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గూడపాటి మాణిక్యాలరావు సహ ఉపాధ్యాయులు ఎస్‌విఎస్.రవికుమార్, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్, కేత వెంకటేశ్వరరావు అభినందించారు.

ఆరోగ్యవంతమైన యువత రక్తదానం చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆరోగ్యవంతమైన యువత రక్తదానంతో కొందరి ప్రాణాలు నిలపవచ్చుని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు అన్నారు. యాసలపు సూర్యారావు వర్ధంతి కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సిరపరపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రక్తదానం చేయడం ద్వారా ప్రమాదంలో ఉన్నవారి ప్రాణాలను కాపాడ వచ్చున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త సందక శ్రీను మాట్లాడుతూ సూర్యారావు పేరుమీద ప్రతి ఏటా రక్తదాన శిబిరం నిర్వహించండం అభినందనీయమన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగా సూర్యారావు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివన్నారు. ఈ సభ ప్రారంభానికి ముందు యాసలపు సూర్యారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ శిబిరంలో అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్త సేకరణ జరిపారు. రక్త దాతలకు మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ పౌష్టికాహారం అందచేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు చౌదరి, డి.గంగాధరుడు, డాక్టర్ తాళ్లూరు శేఖర్, డాక్టర్ గీత, విశాల్ అనూష వీరమణి మహాలక్ష్మి, చింతల సత్యనారాయణ, వడ్డి సత్యనారాయణ, గడిగట్ల సత్తిబాబు, సిపిఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతి కుమార్, కేదారి నాగు, నీలపాల సూరిబాబురాజు, జి.పెంటయ్య, డి.కృష్ణ, వీర్రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదిత్యలో ఫ్యాకల్టీ ప్రోగ్రామ్ ముగింపు

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ సెల్ ద్వారా ఎఐసిటిఇ సౌజన్యంతో యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ అనే అంశంపై 8 రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ఫలప్రదంగా ముగిసినట్లు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ప్రస్తుత సమాజంలో విద్యతో పాటు మానవతా విలువలు కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని దానికి గాను విద్యార్థులలో మానవతా విలువలు పెంపొందించడంలో ఫ్యాకల్టీ తోడ్పాటు కూడా ఉండాలని భావించి ఉపాధ్యాయ సిబ్బందికి ఈ శిక్షణా తరగతులు నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐసిటియు తరపున వచ్చిన ప్రతినిధి ప్రొఫెసర్ ఎస్.సునీల్ కుమార్ నేతృత్వంలో అధ్యాపక వృత్తిలో హ్యూమన్ వాల్యూస్ తదితర అంశాలపై ఈ 8 రోజుల కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని తెలిపారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ఫ్రెష్ మ్యాన్ విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ.వానతి, ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్స్ డాక్టర్ ఆర్.సుధాకర్ రెడ్డి, పి.సూర్య వెంకటేష్ పాల్గొన్నారు.

22న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈనెల 22న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వీటికి సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. చిలుకూరి మాచరయ్య సత్యవతి, దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు కైలాసపతి పద్మావతి, దంపతుల నిర్వహణలో వీరి మనవలు కేపిటల్ హాస్పిటల్ కాకినాడ వైద్యుల తో ఆదివారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తారన్నారు. బిపి, షుగర్, థైరాయిడ్, గుండె సమస్యలు తదితర వ్యాధులకు సంబంధించి నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని అంగర, పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆదిత్యలో ఎన్‌సిసి క్యాంపు ముగింపు

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీలో ఈ నెల 11 నుంచి 20 వరకు నిర్వహించిన సిఎటిసి-7 ఎన్‌సిసి క్యాంపు విజయవంతంగా ముగిసిందని కమాండింగ్ ఆఫీసర్ గ్రూప్ కెప్టెన్ ప్రవీణ్ బాబు తెలిపారు. పది రోజుల పాటు నిర్వహించిన ఈ క్యాంపులో క్యాడెట్స్‌కు దేశ భద్రత, సైబర్ నేరాలపై అవగాహన, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం ద్వారా ప్రకృతి విపత్తుల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఈ క్యాంపులో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి వచ్చిన 450 మంది క్యాడెట్స్‌కు ఆదిత్య యూనివర్సిటీ అతిథ్యం ఇవ్వడం, ఎన్‌సిసి క్యాడెట్స్‌ను ప్రోత్సహించడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు.

64వ రోజుకు రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - మండపేట

మండలం కేశవరం గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో వల్లూరు శ్రీవాణి చేస్తున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం 64 వరోజుకు చేరింది . ఈ సందర్భంగా శ్రీ వాణి మాట్లాడుతూ తొమ్మిది వేల జనాభా ఉన్న ఊరులో హైస్కూల్ కాంపౌండ్ ప్రహరీ నిర్మించాలని కోరుతున్నప్పటికీ ఏ ఒక్కరూ కూడా స్పందించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. హై స్కూల్ స్థలంలో ఆక్రమ కట్టడాలను తొలగించి ప్రహరీ నిర్మించే వరకు నా దీక్ష విరమించేది లేదని శ్రీవాణి తెలిపారు.

యోగాలో ఉత్సాహంగా విద్యార్థులు

ప్రజాశక్తి- పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది నెల రోజులుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గడ్డం జ్యోతిర్మయ్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా యోగాలో శిక్షణ పొందుతున్నారు. యోగా గురువు రమణ శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రిన్సిపల్ జ్యోతిర్మయి మాట్లాడారు. చేశారు. కరస్పాండెంట్ శాస్త్రి రమేష్, కళాశాల పాలకవర్గ సభ్యులు వత్సవాయి లక్ష్మి సూర్యనారాయణ రాజు, రావు ప్రభాకరరావు విద్యార్థులను అభినందించారు.

తుని మార్కెట్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-తుని

తుని మార్కెట్ యార్డ్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని ప్రభుత్వ విప్, తుని ఎంఎల్ఎ యనమల దివ్య తెలిపారు. శుక్రవారం తుని పట్టణంలో అతిథి ఫంక్షన్ హాల్లో నూతనంగా ఏర్పడిన మార్కెట్ యార్డ్ పాలకవర్గంతో చైర్మన్ అంకంరెడ్డి రమేష్, వైస్ చైర్మన్ అద్దేపల్లి జానకి మిగతా పాలకవర్గ సభ్యులతో ఎంఎల్ఎ యనమల దివ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులకు చేరవేరే చేర్చే విధంగా నూతన పాలకవర్గం పని చేయాలన్నారు. అన్ని సామాజిక వర్గాలకూ సముచిత స్థానాన్ని కల్పిస్తూ కూటమి ప్రభుత్వం సమిష్టిగా పాలకవర్గాన్ని ఎంపిక చేసిందని తెలిపారు. సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతమనేడు అబ్బాయి, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయనాణ కుసుమంచి శోభారాణి, నార్ల భువన సుందరి, గాడి రాజబాబు, పెంటకోట భాస్కర్ సత్యనారాయణ, గొర్లి అచ్చియ్యనాయుడు, దంతులూరి చిరంజీవి, చొక్కా అప్పారావు, కరపా అప్పారావు, ఎంపిపి బొప్పన రాము, చోడిశెట్టి గణేష్, బోనం చినబాబు పాల్గొన్నారు.

కుల మత విభేదాలకు బిజెపి ఆజ్యం

ప్రజాశక్తి - జగ్గంపేట

బిజెపి ప్రభుత్వం కుల మత భేదాలకు ఆజ్యం పోస్తోందని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుక నాగేశ్వరరావు విమర్శించారు. ఈ నెల 16 న కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గంలో దళిత సర్పంచ్‌ను అవమానించడాన్ని నాగేశ్వరరావు ఖండించారు. ఎంఎల్ఎ పార్థసారథి నిర్వహించిన సదస్సులో వేదిక పైకి సర్పంచ్‌ను ఆహ్వానిస్తుండగా పక్కనే ఉన్న బిజెపి కార్యకర్తలు నిలిపివేశారన్నారు. ఇది యావత్ భారతదేశానికి సిగ్గుచేటన్నారు. స్టేజ్ కింద నిలబెట్టి అవమానించిన ఎఉఎంఎల్ఎపైనా, బిజెపి కార్యకర్తలపైన ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

డిజిటల్ క్లాస్ రూమ్ ప్రారంభం

ప్రజాశక్తి -కరప

అరట్లకట్టలో ప్రైమరీ స్కూల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్, ఆటల పరికరాలను రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ శుక్రవారం ప్రారంభించారు. శుక్రవారం రూరల్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అరట్లకట్టలో మోడల్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో అరట్లకట్ట మోడల్ స్కూల్ ప్లేజోన్‌కు రూ.2 లక్షల విలువైన ప్లే ఎక్విప్మెంట్‌ను పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.విశ్వేశ్వరరావు స్నేహితులైన అమెరికాకు చెందిన పొన్నపల్లి రమేష్ (మండపేట), ముత్యాల తారక రామారావు (తాపేశ్వరం) డిజిటల్ థియేటర్‌కు గ్రామానికి సంబంధించిన పెద్దలు ప్రత్తిపాటి ఆదిరాజు రూ.30,000, గంటా వీరన్న చౌదరి రూ.30,000 , రాయుడు ఈశ్వర్ రావు రూ.10,000 అందించారు. రూ.25 వేల విలువైన నోట్ పుస్తకాలను అందించారు. వారు అందజేసిన నోట్ పుస్తకాలను ఎంఎల్ఎ పంతం నానాజీ విద్యార్థులకు అందించారు. దాలత ఔదార్యాన్ని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు బికె.కృష్ణవేణి, పి.సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ గోపి సత్యవేణి, నక్కామల్లె పవన్, భోగిరెడ్డి కొండబాబు, బండారు మురళి, ముద్రగడ రమేష్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా సిసి రోడ్లు

తాళ్లరేవు : పి.మల్లవరం గ్రామ పంచాయతీ పత్తిగొందిలో నిబంధనలకు విరుద్ధంగా రూ.10 లక్షల పంచాయతీ నిధులతో సిసి రోడ్ల నిర్మాణం చేశారని పంచాయితీ 11వ వార్డు సభ్యురాలు దున్నా నాగరత్నం ఆరోపించారు. ఆమె భర్త రవిశంకర్‌తో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రహదారి నిర్మించక ముందే టెండర్లు పిలవాల్సి ఉండగా నిర్మాణం తర్వాత టెండర్లు పిలవడానికి పంచాయతీ సమావేశం ఏర్పాటు చేశారని అన్నారు. టెండర్లు పిలవకుండా అధికారుల పర్యవేక్షణ లేకుండా రోడ్లు వేసినట్లు తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అయిపోయిన పనులకు అనుమతులు ఇవ్వడానికి శనివారం పంచాయతీ సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తల్లికి వందనం సమస్యలు పరిష్కరించాలి

పెద్దాపురం : తల్లికి వందనం పథకంలో వివిధ సాంకేతిక సమస్యలను గుర్తించి లబ్ధిదారులు నష్టపోకుండా వేగవంతంగా సమస్యలు పరిష్కరించాలని డిఎల్‌డిఒ ఎం.శ్యామల అన్నారు. శుక్రవారం ఆమె జి.రాగంపేటలో సచివాలయాన్ని సందర్శించి సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయంలో ఆధార్ ఇకెవైసి నమోదు చేయాలన్నారు. తల్లికి వందనం పథకంలో నెలకొన్న సాంకేతిక సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎం.వీరబాబు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్లు అందిస్తున్న నాయకులు

విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ

ప్రజాశక్తి- సామర్లకోట

విద్యార్థుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని టిడిపి యువ నాయకులు చల్లా బుజ్జి అన్నారు. సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లను చల్లా బుజ్జి అందచేశారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, పెద్దాపురం ఎంఎల్ఎఉ నిమ్మకాయల చినరాజప్పకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీతకు మోక్షం ఎప్పుడో..?

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రుతుపవనాల ప్రభావంతో మండల వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. రైతులు ఏరువాక పౌర్ణమి నిర్వహించుకుని సాగుకు సమాయత్తమయ్యారు. కానీ రైతుకు సాగునీరు ఇవ్వాల్సిన అధికారులు, నిర్లక్ష్యం వహిస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ఏటా ఏప్రిల్, మే నెలల్లో పంట కాలువల్లో పూడికలు తొలగించి, సాగునీరు రైతుకు అందేలా అధికారులు సమాయత్తం అవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు పూడికతీత పనులు నేటికీ చేపట్టలేదు. ఖరీఫ్ సాగుకు సిద్ధపడుతున్న రైతుకు సాగునీరు ఏవిధంగా ఇస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. నీటి యజమాన్య సంఘాలకు ఎన్నికల నిర్వహించి పదవుల్లో ఊరేగుతున్న వారు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పంట కాలువల్లో పూడికలు తీయకపోవడం వల్ల, తుప్పలతో కాలువలు మూసుకుపోయాయి. కొన్నిచోట్ల వ్యాపారస్తులు కాలువులను కంపోస్ట్ యార్డులుగా వినియోగిస్తున్నారు. కొన్నిచోట్ల పంట కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. కొన్నిచోట్ల పంట కాలువలను ఆక్రమించి పక్కా గృహాలు నిర్మాణం జరిగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువల్లో పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.